


ఖాజీపేట్లో బస్సు ఎక్కి కూర్చున్నాను.

బస్సు కదిలేదాకా ఆఫీసులోవాళ్ళు బడ్జెట్ గూర్చి, రిజర్వేషన్ ఆందోళన గూర్చి, ఆఫీసులో గుర్నాధం గూర్చి మాట్లాడేరు. మధ్య మధ్యలో మా నాన్న ఆరోగ్య పరిస్థితి గూర్చి ప్రశ్నలువేశారు. అటెండెరు ద్రాక్షపళ్ళ బుట్ట తెచ్చి బస్సులో నా సీటు ప్రక్కన పెట్టాడు. మిగతా చిల్లర ఇవ్వబోయేడు. అతని దగ్గరే వుంచుకోమని చెప్పి, 'అప్పుడప్పుడూ యింటికెళ్ళి అమ్మగారికి కనబడి వెళ్తూండు' అని చెప్పాను.

బస్సు కదిలింది.

బస్సు సిటీ పొలిమేరలు దాటేంత వరకూ ఆఫీసు గొడవలే మనసులో మెదులుతూ వున్నాయి.

ఇంటిమీద ధ్యాస మళ్ళడానికి చాలా సేపు పట్టింది.

"ఫాదర్ సీరియస్: స్టార్ట్ ఇమ్మీడియెట్లీ!"

తమ్ముడి దగ్గర్నుంచి టెలిగ్రాం రావడం ఇది మూడోసారి. మూడుసార్లు పొన్నూరు వెళ్ళి తిరిగివొచ్చేడు నాన్న ఆరోగ్యం మెరుగవ్వడంతో.

నాన్నకి ఎనభైయేళ్ళ వయస్సు. 'హైదరాబాదు వొచ్చేయి. "ఇక్కడ పెద్ద డాక్టర్లు వున్నారంటే...." ససేమిరా.... అక్కడనుంచి కదలనంటాడు. బలవంతం చేసి తీసుకురావడం నాక్కూడ ఇష్టం లేదు. పెద్దాయన మొదట్నుంచి అక్కడ అలవాటుపడిన మనిషి. పట్నం వచ్చినా వుండలేడు.

మా యింట్లో ఆఖరి శ్వాస వొదలాలంటాడు

మండువా లోగిలి యిల్లు మాది.

చుట్టూ పెద్ద ప్రహరీ గోడ. తూర్పు దిక్కున పెద్ద ఆర్చి. ఆ ఆర్చిపై పిల్లన గ్రోవి వూదుతున్న గోపాలకృష్ణుడి రంగుల బొమ్మ. రెండువైపుల రెండు ఆవులు. మోర పైకెత్తి గోపాలకృష్ణుడి వైపు చూస్తూ, మురళీనాదం వింటూ మైమరచివున్న ఆ ఆవులు. కృష్ణుడి బొమ్మపై కాళింది సర్పం పడగవిప్పి గొడుగులా ఏర్పడిన బొమ్మ రోడ్డున పోయేవాళ్ళందరి దృష్టి ఆకర్షించేది.

ప్రహరీ గోడ మా తాతయ్య కట్టించాడట. దాదాపు వందేళ్ళ చరిత్ర వుంది దానికి. ఇంటిచుట్టూ గోడ పది అడుగుల ఎత్తు వుంటుంది. ఆ గోడ పాత తరానికి యీ తరానికి మధ్య వారధి. ఆర్చి దగ్గర పెద్ద గేటు. రాజుగారి కోటగోడలా వుంటుంది.

గేటుకు ఇరువైపులా రెండు పెద్ద అరుగులున్నాయి. వూళ్ళో పెద్దమనుష్యులంతా సాయంకాలమయ్యేసరికి ఆ అరుగుల మీదకు చేరుకునేవారట. తాతయ్య మాటంటే వూళ్ళోవాళ్ళందరికి వేద వాక్కు. ఊళ్ళో ఏ సమస్య వొచ్చినా అక్కడ పరిష్కారమయ్యేది.

నాకు ఆరేళ్ళ వయస్సప్పుడే తాతయ్య చనిపోయేడు. చెట్టంత మనిషి. పెద్ద మీసం. ఛాతీమీద దట్టంగా వెంట్రుకలు. వీపుమీద కూడ వుండేది. అరుగుమీద కూర్చుని పుగాకు పాయలు తీస్తూ చుట్ట చుట్టుకోవడం "ఫస్.... ఫస్" మని రెండు పెదిమల మధ్య చుట్ట అదిమిపెట్టి చుట్ట తాగడం నాకింకా లీలగా గుర్తు.

నాయనమ్మ చెబుతూ వుండేది. ప్రహరీగోడ కట్టించేటప్పుడు పునాదుల్లో పెద్ద ఇత్తడిపెట్టె దొరికిందట. అందులో ఎప్పటిదో మధ్య బంగారపు పువ్వుతో వెండి పళ్ళాలు, గ్లాసులు, వడ్డాణాలు దొరికాయట.

ఆ పెట్టె 'నాకు రావాలంటే.... నాకు రావా'లని తాతయ్య, తాతయ్య తమ్ముడు కొట్లాడుకున్నారట. వాళ్ళిద్దరి మధ్య కర్రసాము చూడటానికి వూళ్ళోవాళ్ళంతా పోగయ్యారట. చిన్న తాతయ్యకే ఎక్కువ దెబ్బలు తగిలేయి. ఆ కోపంలో తాతయ్య గడ్డివాములు తగలెట్టాడు చిన్న తాతయ్య.

మరునటి రోజునుంచి ఎవ్వరికీ కనబడలేదు చిన్న తాతయ్య. తాతయ్యకి భయపడి పారిపోయ్యాడని కొందరు, చిన్న తాతయ్యని చంపేసి గోడ పునాదుల్లో వేసి గోడకట్టడం పూర్తిచేశాడని మరికొందరంటూవుండేవాళ్ళు.

మొత్తంమీద 'చైనా గోడ'కున్నంత చరిత్ర లేకపోయినా కాస్తో కూస్తో చరిత్ర వుంది మా ప్రహరీగోడకి.

చిన్నప్పుడు ఆ గోడ ఎక్కి చుట్టూ తిరిగేవాళ్ళం నేను మా తమ్ముడు. దక్షిణం దిక్కున గోడకు ఆనుకుని బొబ్బాయి చెట్లుండేవి. బొబ్బాయికాయమీద ఎర్ర

గీతలు కనబడగానే కోసేసి చిప్పపీపాలో పడేసేవాళ్ళం. మరునటి రోజుకల్లా మెత్తగా పండిపోయ్యేవి. వో సారి కాయలు కోస్తుంటే గోడమీదనుంచి కింద పడ్డా. రెండు మూడు పళ్ళు రాలినై. నుదిటిమీద పెద్ద గాయమైంది. నుదుటి మీద గాయంమచ్చ శాశ్వతంగా వుండి పోయింది.

ఆ గోడంమీద ఎన్నిసార్లు ఎన్నికల గుర్తులు, పేర్లు, వాగ్దానాలు రాశారో! చిన్నప్పుడు నేనే ఎన్నికల ప్రచారం చేసే వాళ్లను పిల్చుకొచ్చి గోడంమీద రాయించే వాడిని. అన్ని పార్టీల ప్రచారం మా ప్రహారీగోడల మీద చోటుచేసుకునేవి. కొన్ని పార్టీలవాళ్ళకి వో నమ్మకం వుండేది. ఏసుకు ముందు మా గోడమీద రాస్తే వాళ్ళపార్టీ వ్యక్తి గెలుపొందు తాడనే నమ్మకం వుండేది.

సినిమా వాల్‌పోస్టర్ల సంగతి చెప్ప నవసరంలేదు. మా చిన్నతనంలో వో టూరింగ్ టాకీస్ వుండేది. మరి ఇప్పుడో ఐదారు సినిమాహాళ్ళు వున్నాయి. గోడల నిండా సినిమాతారల బొమ్మలే! పని పాటలకు వెళ్ళేవాళ్ళు వో ఐదు నిము షాలు ప్రహారీగోడ దగ్గర నిలబడి వాల్ పోస్టర్లు చూసి వెళ్ళాల్సిందే!

నాన్న పూర్తిగా తాతయ్యకి వ్యతి రేకం నాన్నదంతా సాత్విక మనస్తత్వం. ఎవ్వరినీ నొప్పించేవాడు కాదు. ఇప్పటికీ వూళ్ళో పాతకాలంనాటి మనుష్యులు అరుగులమీద చేరినా, వాళ్ళ మాటలు నాన్న వినడమేగాని నోట్లోనుంచి మాట ఊడిపడేది కాదు.

నాన్న తరంలో ప్రహారీ గోడలో ఎన్నో మార్పులు వొచ్చాయి. నాన్నకి వార్ధక్యం వొచ్చినట్లుగానే ఆ గోడకి వార్ధక్యం వొచ్చింది. గోడ అక్క డక్కడ బీటలువారింది. పెచ్చు లూడి పోయి ఇటుకలు బయటపడ్డాయి. ఆర్చి మీది కృష్ణుడిబొమ్మ రంగులు వెలసిపోయి కళావిహీనంగా తయారయ్యింది. ఇల్లు మరమత్తులు చేయించాడేగాని, ప్రహారీ గోడ జోలికి వెళ్ళలేదు తమ్ముడు. ప్రహారీగోడ మరమత్తు అనవసరమని వాడి భావన........

బస్సు సూర్యాపేటలో ఆగింది.


బస్సు దిగి టీ తాగాను.

బస్సుస్టాండు దగ్గర్లో వో కాంపౌండ్ వాల్ కన్పించింది. ఆరడుగుల ఎత్తు, తొమ్మిదంగుళాల వెడల్పు వున్న గోడ. గోడపైన అందమైన డిజైన్స్. గోడ పైభాగంలో గాజుపెంకులు గుచ్చబడి వున్నాయి. గోడకి ఇనపగేటు.

కాలంలో చాల మార్పులొచ్చాయి. ఇప్పుడెవరు పది అడుగుల ఎత్తు, రెండ డుగుల వెడల్పుతో ప్రహారీగోడ కడుతున్నారు. ఆర్చిలు అసలే కట్టడం లేదు.

బస్సు ఎక్కి కూర్చున్నాను.

* * *




బస్సు దిగి ఇంటికి వెళ్ళేసరికి అప్పుడే తెల్లవారుతూంది.

రాత్రి పెద్ద వర్షం కురిసింది కాబోలు రోడ్డంతా చిదర, చిదరగా వుంది. రోడ్డు ప్రక్కన గుంటలనిండా నీళ్ళు.

దోవలోనే రిక్షా ఆపి పలకరించాడు బంధువొకాయన.

"ఇప్పుడేనా రావడం! రాత్రే పోయాడయ్యా మీ నాన్న! మంచితనం తప్పితే మనిషిలో మరొకటి కానరాదు. ఆయన శకం అయిపోయింది. ఇక వుంటా వచ్చాయి.... తొందరగా ఇంటికి వెళ్ళు. మీ తమ్ముడు ఎదురుచూస్తూ వుంటాడు నీ కోసం."

రిక్షా కదిలింది.

నాన్న ఎవ్వరిపై పల్లెత్తు మాట అనేవాడు కాదు. ఎప్పుడూ పొలాల్లో తోటల్లో తిరుగుతుండేవాడు. తీరిక దొరికినప్పుడు అరుగుమీద కూర్చుని ఎవ్వరన్నా చెప్పే కబుర్లు వింటూ వుండేవాడు.

"నాన్నా! మణిపాల్ వెళ్ళి ఇంజనీరింగ్ చదువుకోవాలి. డబ్బు కావాలంటే"- అడిగినంత ఇచ్చేవాడేకాని "ఏం చదువురా అది? అక్కడ ఎన్ని రోజులుంటావ్? ఎప్పుడొస్తావ్? డబ్బు జాగ్రత్తగా వాడుతున్నావా?"- అని అడిగేవాడే కాదు.

చివరిరోజుల్లో అనారోగ్యం తప్పితే ముక్కు చీది ఎరుగడు. తన పనేమిటో తాను చేసుకుపోవడం, పిల్లలమీద పెద్దగా మమకారం పెంచుకోకపోవడం, ఏ సమస్య పట్టించుకోకపోవడం వల్లే హాయిగా అన్నేళ్ళు బ్రతికాడేమో! మరి ఇప్పుడో! ఆస్తిపాస్తులమీద మమకారం ....పిల్లల్ని గొప్పవాళ్ళని చెయ్యాలనే

తపన.... పట్టుదల వుండటంలో తప్పు లేదు గాని, అడ్డదార్లు తొక్కి లక్షలు లక్షలు సంపాదించి పిల్లల్ని లక్షాధికార్లను చెయ్యాలనుకోవటం పొరపాటు. మనిషి ఈ ఆత్రంలో ఆయుఃపరిమాణాన్ని తగ్గించుకొంటున్నాడు.

....బ్లడ్ ప్రెషర్, హార్ట్ ఎటాక్స్ కారణం ఏమిటి ?

....ఆత్రం....

ఇంటికి వెళ్ళగానే ఎదురుగా కన్పించిన మరో దృశ్యం నన్ను కదిలించివేసింది.

ప్రహరీగోడ, ఆర్చీ కుప్పగా కూలి పోయింది.

నాన్న చనిపోయిన క్షణాల్లోనే గాలి వానకి ప్రహరీగోడ కూడా కూలి పోయిందట.

నాన్నకి దహన సంస్కారాలు పూర్తయ్యాయి.

వొచ్చిన చుట్టాలంతా వెళ్ళిపోయారు.

ఆఫీసుకు వెళ్ళాలనిపించక నెల రోజులు సెలవు పొడిగించా.

మొదట రెండు మూడ్రోజులు తమ్ముడు ముభావంగా వుంటే నాన్న చనిపోయినందుకు 'అప్‌సెట్' అయ్యేడేమోననుకున్నాను.

ఆ తర్వాత రుస, రుసలు మొదలు పెట్టాడు.

నాన్న వీలునామా రాసి పోలేదట.

వాడు పొలం చెప్తుంటే నేనూ వింటున్నాను

"పొలంమీద ఆయివేజు, రైసుమిల్లు మీద ఆదాయం మొత్తం మనింట్లో ఎంత వుండి వుంటుందిరా?"

లెక్కలు అడుగుతున్నందుకు వాడికి కోపంవొచ్చింది. ముఖం ముడుచుకున్నాడు

మాగాణి పొలాలన్నీ తిరిగి తమలపాకుల తోటదగ్గరకొచ్చాం. అది అయిదెకరాల మెట్టభూమి.

మోటర్ షెడ్డు దగ్గర కూర్చున్నాం.

పనికుర్రాడిని పురమాయించి కొబ్బరి బొండాలు కొట్టించాడు తమ్ముడు.

మళ్ళీ అడిగా డబ్బెంతుందని.

"నాన్న దినానికి అయిదువేలయింది. ఇంకా నలభై వేలుండొచ్చు."

"ఆ డబ్బు నాకిచ్చేయి. పొలం, ఇళ్ల స్థలాలు, మన ఇల్లు నువ్వే తీసుకో. ఆ డబ్బు నా సొంతానికి కాదు. ప్రహరీగోడ కట్టిందామనుకుంటున్నా!"

తమ్ముడి మొహం ప్రసన్నం అయ్యింది.

"ఆ ప్రహరీగోడ కట్టించే బదులు రెండెకరాల మాగాణి కొనుక్కోవచ్చు... అయినా ప్రహరీగోడ అవసరమేముంది ఇప్పుడు. అంతగా కట్టించాలంటే వొంటి రాయి వరుసతో తక్కువ ఖర్చుతో కట్టించుకోవచ్చు. పైగా మన ఇంట్లో భాగం వొద్దంటున్నావ్! ప్రహరీగోడ నువ్వు కట్టించడమెందుకు?"

"ఇక్కడ పొలాలు, ఇల్లూ పిచ్చేరా! పొలాల్లో తిరిగి కష్టపడి పంట పండిస్తుంది

నువ్వు: చిన్నప్పటినుంచి ఈ వూళ్ళో వుంటి నువ్వు. నువ్వూ నాన్న కష్టపడి సంపాదించిన డబ్బు ఖర్చుపెట్టి చదువుకుంటి నేను.. సిటీలోనే పాతికేళ్ళు గడిపేశా: శేష జీవితం కూడా అక్కడే: ఎప్పుడన్నా ఇక్కడకు వస్తే పాతకాలం గుర్తుగా మన ప్రహరీగోడ కన్పించేది. ఆ గోడ ముందున్న అరుగులమీదే తాతయ్య మనల్ని వొళ్ళో కూర్చోబెట్టుకుని కబుర్లు చెబుతూవుండేవాడు. చుట్టుప్రక్కల వూళ్లోవాళ్ళంతా ఆశ్చర్యంగా మన గోడకేసి చూస్తుండేవాళ్ళు. ఆ కట్టుబడికి విస్తుపోతుండేవాళ్ళు... ఆ రోజుల్లో అంత పెద్ద ప్రహరీగోడలు, ఆర్చిలు ఎవ్వరూ కట్టించలేదు. ఆ పాతకాలం నాటి కట్టడాన్ని యథాతథంగా కట్టించాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. నా ఇంజినీరింగ్ అనుభవం కూడ ఉపయోగించి నలుగురిని ఆకట్టుకునేటట్లు కట్టిస్తా:"

నా మాటలు వాడికంతగా రుచించలేదు. నన్నో పిచ్చివాడిలా జమకట్టి నా వైపు చూడటం ప్రారంభించేడు.

* * *

మొత్తంమీద కష్టపడి తాతయ్యకాలం నాడు ఆర్చిపై కృష్ణుడి బొమ్మ, ఆవుల బొమ్మలు చెక్కిన శిల్పి కొడుకును పట్టుకున్నాను. ఆయన బాగా ముసలివాడై పోయ్యాడు. మొదట ఓపిక లేదన్నాడు. డబ్బు ఎక్కువగా ముట్టజెప్పుతాననేసరికి బయల్దేరేడు. వాళ్ళ కుటుంబం వంశపారంపర్యంగా శిల్పకళకే అంకితమైపోయారట. శిల్పకళ పెద్దగా ఆదరణ లేకపోవడంతో బాగా చితికిపోయింది వాళ్ళ కుటుంబం.

మళ్ళీ ప్రహరీగోడ లేచింది.

ఆర్చి, దానిపై గోపాలకృష్ణుడి మోహనరూపం, ఇరుపక్కల ఆవులు మనోహరంగా తయారయ్యాయి.

ప్రహరీగోడ కట్టిస్తుంటే మా తమ్ముడి పిల్లలు ఆసక్తిగా చూస్తున్నారు.

వాళ్ళు తప్పకుండా వాళ్ళ పిల్లలకు చెబుతారు "ఈ గోడ మీ తాతయ్య కట్టించాడురా!" అని. సరైన అవగాహనవుంటే "పాత కట్టడానికి మళ్ళీ జీవం పోశారు శిల్పులు, మేస్త్రీలు. తాతయ్య దేముంది? డబ్బులున్నాయి కాబట్టి కట్టించగల్గాడు" అని తప్పకుండా అనుకుంటారు.

